క్లుప్తంగా

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

వెంకటగిరి రూరల్ : వేసవి సెలవులను పురస్కరించుకుని వెంకటగిరి పట్టణంలోని తారకరామా మైదానంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు క్యాంపు జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9959722799లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ద్రౌపది అమ్మవారి తిరునాళ్ల

తడ: మండలంలోని వాటంబేడులో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. 7వ రోజు గురువారం భారతంలో కామధేను పర్వాన్ని చేపట్టారు. అర్జున తపస్సు, ఈశ్వరుని నుంచి పాశుపతాస్త్రం పొందడం, కాలకేయ సంహారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం విరాట పర్వం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

దొరవారిసత్రం : త్రైత సిద్ధాంత సేవా సమితి రూపొందించిన తెలుగు ఉగాది క్యాలెండర్‌ను గురువారం ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పోలీస్ సిబ్బందికి అందజేశారు. సేవా సమితి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సుబ్రమణ్యం, శ్రీనివాసులు, చామంతి, సుమలత పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌గా ఉరుకుందమ్మ



నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపల్ మేనేజర్‌గా ఎం.ఉరుకుందమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై నాయుడుపేట మున్సిపల్ మేనేజర్‌గా బదలీ అయ్యారు. ఆమె కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రైతుకు సన్మానం



సుబ్రమణ్యంను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

దొరవారిసత్రం : పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అరఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేసిన పోలపుడి సుబ్రమణ్యంను గురువారం ఏకొల్లులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతు తన అనుభవాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడితో పాటు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపాలని కోరారు.

8 నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఈ నెల 8 నుంచి 14 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ ఏసీ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి తెలిపారు. వారు గురువారం బ్రహ్మోత్సవాల ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, కృష్ణయ్యతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంచలకోన బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిపారు. ఈ క్రమంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందన



చిల్లకూరు : పదో తరగతిలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన చిల్లకూరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి బొమ్మిశ్ల చరణ్‌తేజను గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి ఉన్నత చదువులకు సహకారం అందిస్తామని తెలిపారు. పీడీ గీత, ప్రిన్సిపాల్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

మురుగుతో నిండిన నెర్రికాలువ

- చౌడుగా మారుతున్న భూములు
- కలుషితమవుతున్న చెరువు నీరు
- ఆ నీరు తాగి పక్షుల మృత్యువాత
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నెర్రికాలువ దుస్థితి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల రైతులకు సాగునీటి వనరుగా ఉన్న నెర్రికాలువ మురుగు కాలువగా మారిపోయింది. ఇది దొరవారిసత్రం మండలం తనియాలి నుంచి తడ మండలం కారిజాత, వాటంబేడు చెరువుల దాకా 17.5 కిలోమీటర్లు వుంది. వర్షాకాలంలో కాళంగి నది ఆనకట్ట నుంచి నెర్రికాలువ ద్వారా 14 చెరువులకు నీరు చేరుతుంది. ప్రత్యక్షంగా 15 వేల ఎకరాలు, పరోక్షంగా మరో 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ కాలువ ప్రస్తుతం తన ఉనికిని కోల్పోతోంది. కొంతమంది కరకట్టలను ధ్వంసం చేసి మట్టిని తరలిస్తున్నారు. మరికొంతమంది కాలువ భూమిని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటున్నారు. సూళ్లూరుపేట పట్టణం నుంచి వెలువడే మురుగు నీటిని పూర్తిగా నెర్రికాలువలోకి వదులుతున్నారు. మురుగు నీరు గోపాల్‌రెడ్డిపాళెం, పాములమిట్ట, వాటంబేడు, కారిజాత చెరువుల్లోకి చేరి నీరు కలుషితమవుతోంది. ఆ నీటిని పొలాల్లోకి పారించడంతో పొలాలు చౌడు భూములుగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతేగాక ఆ నీటిని తాగి వలస పక్షులు మృత్యువాత పడుతున్నారు. రెండేళ్ల క్రితం కారిజాత చెరువులో చేపలు తిన్న పెలికాన్స్ (గూడ బాతులు) సుమారు 50 దాకా చనిపోయాయి.

ఆగిన అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా పని చేసిన కిలివేటి సంజీవయ్య నెర్రికాలువ ప్రాధాన్యతను గుర్తించి బాగు చేయడానికి ప్రయత్నం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి పి.అనీల్‌కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి రూ.28.20 కోట్లు మంజూరు చేయించారు. కాలువ రెండు వైపులా సిమెంట్ వాల్, మధ్యలో సిమెంట్ కాంక్రీట్ బెడ్ వేసి నీరు వృథాకాకుండా చెరువులకు వెళ్లేలా పనులు చేపట్టారు. కొంతమేర పనులు చేశారు. తర్వాత ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో దీనికి గ్రహణం పట్టినట్టు అయింది. పనులు ఆగిపోయాయి. ప్రస్తుత ఎమ్మెల్యే గాని, టీడీపీ నాయకులు గాని పనుల గురించి పట్టించుకోలేదు.



గత ప్రభుత్వ హయాంలో రూ.28.20 కోట్లతో చేపట్టిన సిమెంట్ లైనింగ్ పనులు(ఫైల్)

నూతన వధూవరులకు ఆశీర్వాదం



చిట్టమూరు : నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



కోట : వధూవరులతో మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

చిట్టమూరు/కోట : చిట్టమూరు గ్రామానికి చెందిన తుమ్మగుంట భాస్కర్ కుమార్తె లిఖిత, రేవంత్ వివాహ రిసెప్షన్‌కు గురువారం జరిగింది. అలాగే కోట మండలం ఊనుగుంటపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నమాల కోటారెడ్డి కుమారుడు జీవన్‌రెడ్డి, ఖ్యాతి లిఖిత వివాహం నెల్లూరు సీపీఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆటో ప్రయాణం



మాట్లాడుతున్న సంస్థ నిర్వాహకుడు మల్లికార్జున్

చిల్లకూరు : చిల్లకూరుకు చెందిన పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషనల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వారంలో ఒక రోజు ఉచితంగా ఆటో ప్రయాణం కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ పి.మల్లికార్జున్ తెలిపారు. ఆయన గురువారం చిల్లకూరులోని శంకర గిరిజన కాలనీలో ఉచిత ఆటో ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన కాలనీలో ఉన్న వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, బాలింతలు ప్రతి రోజూ గూడూరు ప్రాంతంలోని ఆస్పత్రులకు వెళుతుంటారని తెలిపారు. ఆటోకు రూ.20 చెల్లించలేక కొంతమంది నడిచి వెళుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి కోసం వారంలో ఒక రోజు ఆటోను ఉచితంగా నడుపుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అరుణబాబు, విజయమ్మ, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి



మాచిరెడ్డి సుధాకర్‌రెడ్డి తల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ



కృష్ణారెడ్డి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మాచిరెడ్డి సుధాకర్ రెడ్డి తల్లి మధుసూదనమ్మ ఇటీవల మృతిచెందారు. గురువారం ఉత్తర క్రియలు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే చిట్టమూరుకు చెందిన జంగిట సురేష్, బాబు తల్లి రమణమ్మ కొద్ది రోజుల క్రితం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మేరిగ మురళీధర్ గ్రామానికి వెళ్లి మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి పేట రాజీవ్‌రామిరెడ్డి, చెన్నారెడ్డి బాబురెడ్డి, మల్లాం ఆలయ మాజీ చైర్మన్లు మాచిరెడ్డి సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, మల్లాం పీఏసీఎస్ మాజీ అధక్షుడు మాచిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండలంలోని పారవోలు పంచాయతీ మాజీ సర్పంచ్ పుల్లూరు కృష్ణారెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పారవోలు చేరుకున్నారు. కృష్ణారెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి, సదారెడ్డి, పేచీరాజ్ పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన



తొట్టెలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

చిల్లకూరు : గ్రామాల్లో వెలువడే చెత్తను ఎరువుగా మార్చి, రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ తెలిపారు. ఆయన గురువారం బూదనం, ఎగువరాజుపాళెం, ఓడూరు, చేడిమాల, తిమ్మనగారిపాళెం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిమ్మనగారిపాళెం, బూదనం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాల్లో చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ జరుగుతోందన్నారు. మిగిలిన పంచాయతీలు కూడా ఎరువును తయారు చేయాలని సూచించారు. అలాగే సంపద తయారీ కేంద్రం వద్ద వున్న ఖాళీ స్థలంలో ఆకు కూరలు, కూరగాయలు పండించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, డీఎల్‌పీవో కార్యాలయ సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి (సైదాపురం) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 22న విశ్వోదయ కళాశాల నుంచి పట్టణం గుండా కాశీవిశ్వనాథస్వామి ఆలయం వరకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు జైశ్రీరామ్, జైహనుమాన్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. వారు గురువారం వెంకటగిరి పట్టణం పాతకోట ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామాంజనేయులు, రామకృష్ణ, విజయలక్ష్మి, ఢిల్లీబాబు, ఆనంద్, రామారావు, అనీల్, తోట కృష్ణయ్య, నర్రా రవి, అలిమిలి మల్లికార్జున్, సుధాకర్, నిర్మల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



పరిహారం చెల్లించాలని కోరుతున్న రైతులు

కోట: క్రిస్‌సిటీ కోసం కొత్తపట్నం పంచాయతీలో తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. వారు గురువారం శ్రీనివాససత్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేవని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పడం విడ్డూరమన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కోట, బాలాయపల్లి తహసీల్దార్లు క్రిస్ సిటీలో రోడ్ల పేరుతో వేరుశనగ పంటను యంత్రాలతో తొక్కించారన్నారు. వైస్ ఎంపీపీ శేషయ్య, సర్పంచ్ తిరుపాలయ్య, వైస్ సర్పంచ్ ప్రసాద్‌గౌడ్, వెంకటాద్రి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ఓజిలి: మానమాలలోని సాయిబాబా మందిరంలో గురువారం పాలాభిషేకం, అభిషేకాలు చేసి బాబాను గజమాలతో అలంకరించారు. మధ్యాహ్నం సర్పంచ్ ఉచ్చూరు జీవనారెడ్డి, సాయివెంకటేష్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. మందిర నిర్మాణ కర్తలు హరనాథ్ రెడ్డి, శోభారాణి తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి మీనాక్షిసుందరి

నాయుడుపేట టౌన్ : కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.మీనాక్షి సుందరి తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏదైనా సమస్య వస్తే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం తరఫున న్యాయవాదిని ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు అందిస్తామస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, అర్హులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య, కమిషనర్ షేక్ ఫజులుల్లా, బార్ అసోసియేషన మాజీ అధ్యక్షుడు వెందోటి పార్థసారథిరెడ్డి, జీవీఎల్‌కే కిషోర్, పసల గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకోవాలి



న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన గిరిజనులు

కోట: వెంకన్నపాళెం వద్ద బైక్ ఢీకొని మృతి చెందిన తిన్నెలపూడి గిరిజన కాలనీకి చెందిన పొన్నూరు శ్రీనివాసులు(43) కుటుంబానికి న్యాయం చేయాలని కాలనీ వాసులు కోరారు. పోస్టుమార్టం అనంతరం శ్రీనివాసులు మృతదేహాన్ని గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని కాలనీ వాసులు తెగేసి చెప్పారు. మృతదేహంతో ఆందోళనకు సిద్ధమయ్యారు. తిన్నెలపూడికి చెందిన గ్రామపెద్దలు జోక్యం చేసుకుని వెంకన్నపాళెం గ్రామస్తులతో చర్చించారు. మృతుడు శ్రీనివాసులు కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ప్రమాదానికి కారణమైన వెంకన్నపాళెంకు చెందిన మనబాక వెంకటరమణయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వాడవాడలా ఎర్ర జెండా రెపరెపలు



జిల్లా నాయకులతో కలిసి మేడే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో గురువారం మేడేను కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రజా సంఘాలు, కార్మికుల యూనియన్ తదితర సంఘాల ఆధ్వర్యంలో భవన నిర్మాణ, పారిశుద్ధ్య కార్మికులు, మెకానిక్కులు, ఇతర అసంఘటిత రంగంలోని కార్మికులు, నాయకులు ఎర్ర జెండాలు ఎగురవేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీలు చేశారు. – సైదాపురం/వెంకటగిరి రూరల్/నాయుడుపేట టౌన్/వాకాడు/కలువాయి(సైదాపురం)/తడ

- సైదాపురంలో రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య ఆధ్వర్యంలో కార్మికులు ఎర్రజెండాలను ఎగురవేశారు. మండల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చెంగల్‌రావు ఐఎఫ్‌టీయూ జెండాను ఆవిష్కరించారు.
- వెంకటగిరిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు జాన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.బాలకృష్ణ, రైతు కూలీ సంఘం రమణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకృష్ణ, స్ట్రీట్ వెండర్స్ యూనియన్ నేత నరసింహులు, మునేంద్ర జెండా ఎగుర వేశారు. సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నేతలు భాస్కర్ ఎర్ర జెండా ఆవిష్కరించారు.
- నాయుడుపేట పాత బస్టాండు సమీపంలో కార్మికులు మేడేను ఘనంగా జరుపుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో మెకానిక్ యూనియన్ కార్యాలయం వద్ద మేడే నిర్వహించారు. బైక్‌లతో ర్యాలీ చేశారు. సీఐటీయూ, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్, లారీ వర్కర్స్, ముఠా మేస్త్రి యూనియన్ నాయకులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కమిటీ నాయకులు భారీ ర్యాలీ చేశారు.
- నెల్లూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్మికుల సమస్యలపై పోరాడతామన్నారు.
- వాకాడులో ఆటో కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ చేశారు. ఆర్టీసీ డిపోలో సీఐటీయూ నాయకులు, కార్మికులు డిపో ఆవరణలో యూనియన్ జెండా ఎగరవేశారు.
- కలువాయిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జరుపుకున్నారు.
- తడ మండలంలో సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో తడ, కారూరు, పూడి, తడకండ్రిగ, బీవీపాడు, కారూరుమిట్ట ప్రాంతాల్లో ఎర్ర జెండా ఎగురవేశారు.
- గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ నేతలు మేడే జరుపుకున్నారు. సీనియర్ మెకానిక్ శాంతకుమార్ ఎర్ర జెండా ఎగువేశారు.



నాయుడుపేట గోమతి సెంటర్ వైఎస్సార్ సర్కిల్ వద్ద కళాకారుల ప్రదర్శనలు

కిశోరి వికాసంపై అవగాహన

కలువాయి(సైదాపురం)/రాపూరు : కలువాయి, రాపూరు మండలాల్లో గురువారం రాపూరు సీడీపీవో సునంద, రాపూరు ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ, పీఆర్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డీఆర్‌డీఏ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కమిటీతో 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలతో గ్రూపులు ఏర్పాటు చేసి ఈ సాధన పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. అలాగే బాలికలకు సామాజిక విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సర్వే ఈ నెల శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్

డక్కిలి : ప్రాథమిక దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని డక్కిలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డి బిందు ప్రియాంక తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం డి.వడ్డిపల్లి, పాతనాలపాడు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార తదితర పరీక్షలు చేశారు. 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి కె.నాగరాజు, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ చైతన్యభాను, హరిత, నాగమణెమ్మ, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.